క్లుప్తంగా

విద్యా సామగ్రి అందజేత



పుస్తకాలు కిట్లను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు

పాలకోడేరు/కాళ్ల/ఆకివీడు: విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలను వినియోగించుకుని ఉన్నత స్థానాలకు చేరాలని ఎమ్మెల్యే కనుమూరి రఘురామకృష్ణరాజు అన్నారు. మంగళవారం పాలకోడేరు ఉన్నత పాఠశాలలో, కాళ్ల మండలం కోపల్లె జిల్లా పరిషత్ హైస్కూల్‌లో, ఆకివీడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యా కిట్లను అందించారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు అన్నింటా ముందు ఉండాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో స్థానిక ఎంఈఓలు, ఆయా గ్రామాల నాయకులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి ఆర్థిక సాయం

పాలకోడేరు: మండలంలోని విస్సాకోడేరు గ్రామానికి చెందిన మండ సోమేశ్వరరావు కుటుంబం ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్నారని తెలుసుకుని హైదరాబాద్‌కు చెందిన సన్నిధి రామలింగేశ్వరరావు, గణపవరానికి చెందిన వంకాయల ఏడుకొండలు కలిసి పది వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. దాతలను ఆర్య వైశ్య మహాసభ కోశాధికారీ గ్రంధి రాజా అభినందించారు. ఈ కుటుంబం పరిస్థితిని సోషల్ మీడియా ద్వారా తెలుసుకుని ఎక్కడో దూరంగా ఉన్న హైదరాబాద్ నుంచి, గణపవరం నుంచి వచ్చి సాయం చేయడం గొప్ప విషయం అని ప్రశంసించారు.

వాండ్రం వీఆర్వోగా కృపాంజలి

ఉండి: మండలంలోని వాండ్రం గ్రామ వీఆర్వోగా వీరవల్లి దైవ కృపాంజలి నియామకమైనట్లు తహసీల్దార్ కె.శ్రీనివాస్ మంగళవారం తెలిపారు.కారుణ్య నియామకం కింద ఉద్యోగం పొందిన ఆమె ఉండి తహసీల్దార్ కార్యాలయంలో ఎన్నికల విధులు నిర్వహించారు. ఎన్నికల ప్రక్రియ ముగియడంతో ఆమెను వాండ్రం వీఆర్వోగా నియమించినట్లు ఆయన తెలిపారు. ఇదే స్థానంలో ఇన్‌చార్జ్‌గా వీఆర్వోగా విధులు నిర్వహిస్తున్న మహదేవపట్నం-2 వీఆర్వో ఎస్.చిన్నారావును రిలీవ్ చేయగా ఆయన తిరిగి మహదేవపట్నం-2లో పూర్తి స్థాయి బాధ్యత చేపట్టినట్లు ఆయన తెలిపారు.

తూర్పు కాపు ఎంపీ, ఎమ్మెల్యేలకు అభినందనలు

భీమవరం: సార్వత్రిక ఎన్నికల్లో వివిధ ప్రాంతాల్లో పార్లమెంట్, శాసన సభ్యులుగా ఎన్నికైన తూర్పు కాపు ప్రజాప్రతినిధులకు భీమవరం పట్టణ తూర్పు కాపు విద్యా విజ్ఞానాభివృద్ధి, తూర్పు కాపు విద్యా కమిటీ సభ్యులు శుభాకాంక్షలు తెలిపారు. సంఘం జిల్లా గౌరవాధ్యక్షుడు మెరగాని అప్పారావు, జిల్లా అధ్యక్షుడు సరిపిడకల రామారావు, పట్టణాధ్యక్షుడు మెరగాని సత్యనారాయణ, ముల్లి లక్ష్మీనర్సింహమూర్తి, తాళ్లపూడి గాంధీ, మెరగాని ప్రసాద్ శుభాకాంక్షలు తెలిపారు. ఎంపీగా ఎన్నికై న కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే కొండపల్లి శ్రీనివాసనాయుడు, మామిడి గోవిందరావు, కిమిడి కళా వెంకట్రావుకు వారు ప్రత్యేక అభినందనలు తెలిపారు.

పాము కాటుకు గురైన ఉపాధి కూలీ

పెనుగొండ: దేవలో ఉపాధి పనులు చేస్తుండగా గుడాల లలిత పాము కాటుకు గురైంది. మంగళవారం దేవ శివారు పెళ్లి కూతరుమ్మ చెరువు వద్ద పంటకాలువలో సుమారు 40 మంది ఉపాధి కూలీలు పనులు పూర్తి చేస్తుండగా పాము కాటు వేసింది. దీంతో లలితను సిద్ధాంతం పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక వైద్యం అందించి, మెరుగైన వైద్యం కోసం పెనుగొండ నుంచి తణుకు ఏరియా ఆసుపత్రికి తరలించారు. ఎంపీడీఓ ఎస్.శ్రీనివాస దొర, టీపీ శంకర్‌లు లలితను పరామర్శించారు.

విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోవాలి



కొడమంచిలిలో విద్యార్థులకు కిట్లు పంపిణీ చేసిన ఎంపీపీ సూర్యకుమారి

పెనుగొండ: విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలని ఆచంట ఎంపీపీ దిగమర్తి సూర్యకుమారి అన్నారు. మంగళవారం కొడమంచిలిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు, విద్యా సామగ్రి పంపిణీ చేశారు.

వైభవంగా ముసలమ్మ ఆలయ వార్షికోత్సవం

పెనుగొండ: ములపర్రు మారేమ్మ గద్దె వద్ద ముసలమ్మవారి ఆలయ వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. మంగళవారం మారేమ్మ గద్దె శెట్టి బలిజ సంఘం ఆధ్వర్యంలో వార్షికోత్సవం నిర్వహించి కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు.

పాఠశాలల్లో మెరుగైన వసతులు

భీమవరం: ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో మెరుగైన మౌలిక సదుపాయాలు కల్పించామని చిన్నారులు తప్పనిసరిగా బడిలోనే ఉండాలని జిల్లా విద్యాశాఖాధికారిణి (డీఈవో) జి.నాగమణి అన్నారు. నేను బడికి పోతా కార్యక్రమంలో భాగంగా మంగళవారం భీమవరం పట్టణంలోని 39వ వార్డులో పర్యటించి మధ్యలో బడి మానేసిన పిల్లల తల్లిదండ్రులను కలిసి వారితో మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలల్లో డిజిటల్ విద్యతోపాటు ప్రతి విద్యార్థికి పాఠ్య, నోట్ పుస్తకాలు, బ్యాగ్‌లు, షూస్, సాక్స్, యూనిఫామ్ వంటివి ఉచితంగా అందిస్తూ రుచి, శుచికరమైన పౌష్టికాహారం అందిస్తున్నట్టు నాగమణి చెప్పారు. ఈ సందర్భంగా లంకపేట ఏరియాలో నివసిస్తున్న ప్రతిఇంటికీ వెళ్లి బడికివెళ్లని పిల్లలను గుర్తించి వారి తల్లిదండ్రులను ఒప్పించి బడిలో చేర్పించారు. ఈ సందర్భంగా ప్రైవేటు స్కూల్లో ఆరో తరగతి చదివి ఫీజులు కట్టలేక రెండేళ్లుగా బడి మానేసిన విద్యార్థిని మౌనికతో మాట్లాడారు. ప్రైవేట్ పాఠశాల యాజమాన్యంతో డీఈవో మాట్లాడి టీసీ ఇప్పించి, పట్టణంలోని పొట్టిశ్రీరాములు మునిసిపల్ గరల్స్ హైస్కూల్లో చేర్పించేందుకు చర్యలు తీసుకున్నారు. అనంతరం పేద పిల్లలకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్ష అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ పీ.శ్యాంసుందర్, డిప్యూటీ డీఈవో ఏ.శ్రీరామ్, సెక్టోరియల్ ఆఫీసర్స్ సీహెచ్.సుబ్రమణ్యం, వై.చంద్రశేఖర్, భీమవరం రోటరీ క్లబ్ సెక్రటరీ షేక్ బాబాజీ సాహెబ్, ప్రధానోపాధ్యాయుడు సుధాకర్ పాల్గొన్నారు.



భీమవరం 39వ వార్డులో పిల్లలకు బిస్కెట్ ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న డీఈవో నాగమణి

రజకుల చెరువు ఆక్రమణలను తొలగించాలని ధర్నా

ఆకివీడు: తరతరాలుగా అనుభవిస్తున్న రజక చెరువును కొన్నేళ్లుగా ఆక్రమణలకు గురైందని ఉమ్మడి జిల్లా రజక సంఘం అధ్యక్షులు చిలకలపల్లి కట్లయ్య ఆందోళన వ్యక్తంచేశారు. మండలంలోని పెదకాపవరం గ్రామంలో రజక చెరువు ఆక్రమణలపై మంగళవారం చెరువు వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1999 నుంచి 2022 సంవత్సరం వరకూ ఆ భూమి అడంగళ్‌లో చాకలి చెరువుగా నమోదైందని చెప్పారు. అనంతం వడుపు నాగేశ్వరరావు పేరు మీద మార్చడం దారుణమన్నారు. చెరువు విషయంలో రెవెన్యూ అధికారులు రికార్డుల్ని తారుమారు చేశారని కట్లయ్య ఆరోపించారు. పంచాయతీ లీజు కట్టించుకోకుండా కాలయాపన చేసిందన్నారు. చెరువును ఆక్రమించిన వ్యక్తులు రజకులపై దౌర్జన్యానికి దిగారని వారిపై చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం డీఎస్పీ, సీఐ, ఎస్సైలు సంఘటనా స్థలానికి వచ్చి కట్లయ్యతో చెరువు విషయంపై సమీక్షించారు. ధర్నా అనంతరం రజక సంఘ నాయకులతో కలిసి కట్లయ్య జిల్లా కలెక్టర్ సుమిత్‌కుమార్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. జీఓ-62 ప్రకారం రజక సంక్షేమ కమిటీని ఏర్పాటు చేయాలని, రజకుల సమస్యల్ని పరిష్కరించాలని వినతిపత్రం అందజేసినట్లు స్థానికంగా విలేకర్లకు తెలిపారు. దీనిపై కలెక్టర్ స్పందించి ఆర్డీను విచారించాలని ఆదేశించినట్లు కట్లయ్య చెప్పారు. కార్యక్రమంలో రజక సంఘ నాయకులు మహంకాళి, యండమూరి శ్రీను, ఐ.ఫణికుమార్, వై.వెంకటలక్ష్మి, పెద్దిరాజు తదితరులు పాల్గొన్నారు.



పెదకాపవరంలో ఆక్రమణలకు గురైన రజక చెరువు వద్ద ధర్నా చేస్తున్న రజకులు

హిప్నాటిస్టు ఉమాచంద్‌కు సత్కారం

భీమవరం: మూడు దశాబ్దాలకుపైగా హిప్నాటిస్టు ఉమాచంద్ అనేక వేదికలపై హిప్నాటిజం ప్రదర్శనలు, అవగాహన సదస్సులు నిర్వహిస్తూ ప్రముఖుల ప్రశంసలు అందుకోవడం అభినందనీయమని విజ్ఞానవేదిక సేవా సంస్థ అధ్యక్షుడు అల్లు శ్రీనివాస్ అన్నారు. మంగళవారం పట్టణంలోని ఐకాన్ జిమ్ వద్ద స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో ఉమాచంద్‌ను సత్కరించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. మద్యం, మత్తు పదార్థాలకు బానిసలైన అనేక మందికి హిప్నాటిజం ద్వారా కౌన్సెలింగ్ అందించిన ఘనత ఉమాచంద్‌కు దక్కుతుందని శ్రీనివాస్ అన్నారు. జిల్లా బాడీ బిల్డింగ్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కటారి రవిశంకర్, షేక్ ఖాసిం మాట్లాడుతూ కళలు సమాజంలోని దురాచారాలను మూఢ నమ్మకాలను పారదోలతాయని దానికి నిదర్శనమే హిప్నాటిజమన్నారు. ఈ కార్యక్రమంలో ఇందుకూరి శివాజీ వర్మ, అరసవల్లి మణికంఠవెంకటేష్, షేక్ ఖాజీ, మోటుపల్లి రామకృష్ణ, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.



భీమవరంలో హిప్నాటిస్టు ఉమాచంద్‌ను సత్కరిస్తున్న దృశ్యం

తాచుపామును రక్షించిన స్నేక్ క్యాచర్



తాచుపామును సంరక్షిస్తున్న స్నేక్ క్యాచర్ మాధవ్

వీరవాసరం: మూగ జీవులు, మూగ ప్రాణాల పట్ల సమాజంలోని ప్రతి ఒక్కరు బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని స్నేక్ క్యాచర్ పి.మాధవ్ తెలిపారు. వీరవాసరం మండలం రాయకుదురు లింగాకారం సెంటర్లో వలలో చిక్కుకున్న ఆరడుగుల నాగుపామును మంగళవారం ఆయన రక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాయకుదురు గ్రామానికి చెందిన సర్వేశ్వరరావు తమ ఇంటి వద్ద అల్లిన ఫెన్సింగ్ వలలో నాగు పాము చిక్కుకుంది. ప్రాణాపాయ స్థితిలో ఉన్న నాగుపామును రక్షించడానికి ఫోన్లో విషయం తెలుపగా కొవ్వూరు నుంచి రాయకుదురు వచ్చినట్టు తెలిపారు. వలలో చిక్కుకున్న పామును రక్షించి ఆహార పానీయాలు అందజేసినట్టు తెలిపారు. పామును సంచిలో భద్రపరిచి అడవిలో వదిలి వేస్తామన్నారు.

యోగాతో ఆరోగ్యం మెండు

భీమవరం: ప్రస్తుత పరిస్థితిలో తినే ఆహారం, వాతావరణ కాలుష్యం, అనేక రకాల వత్తిడితో జీవిస్తున్న ప్రజలు యోగా సంపూర్ణ పరిష్కార మార్గమని యోగ శిక్షకుడు కలిగొట్ల గోపాలశర్మ అన్నారు. రవిశంకర్ గురూజీ, ఉద్దరాజు ఆనందరాజు ఫౌండేషన్, భారతీయ విద్యాభవన్స్, శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు మునిసిపల్ గరల్స్ హైస్కూల్లో మంగళవారం యోగ, ధ్యానంపై అవగాహన సదస్సు, ర్యాలీ, నిర్వహించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. యోగాతో సంపూర్ణ ఆరోగ్యం పొందవచ్చునని అన్నారు.విద్యార్థి దశ నుంచే చిన్నారులకు యోగ వ్యాయామంపై అవగాహన కల్పించాలన్నారు. చెరుకువాడ రంగసాయి మాట్లాడుతూ ఈనెల 21న అంతర్జాతీయ యోగ దినోత్సవం సందర్భంగా నాలుగు రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు, సదస్సులు, ర్యాలీ నిర్వహిస్తున్నామన్నారు. హైస్కూల్ హెచ్‌ఎం జె సుధారాణి మాట్లాడుతూ మానసిక సిద్ధికి, ఆరోగ్య సంరక్షణకు యోగ ఎంతో ఉపకరిస్తుందన్నారు. కార్యక్రమంలో అరసవల్లి సుబ్రమణ్యం, నరహరిశెట్టి కృష్ణ, వారణాసి రాధాకృష్ణ, మహాలక్ష్మి, చిట్టికుమారి పాల్గొన్నారు.



భీమవరం పీఎస్ఎమ్ గరల్స్ హైస్కూల్ విద్యార్థులతో యోగా ప్రతిజ్ఞ చేయిస్తున్న దృశ్యం

రాజగోపాలస్వామికి మామిడి పండ్లతో అలంకరణ

మొగల్తూరు: స్థానిక రుక్మిణీ సత్యభామా సమేత రాజగోపాలస్వామి వారి ఆలయంలో స్వామి వారిని మంగళవారం మామిడి పండ్లతో ప్రత్యేకంగా అలంకరించారు. ఆలయ అర్చకులు సుదర్శనం లక్ష్మీ నరసింహాచార్యులు, రామ్‌కుమార్ ఆచార్యులు,రామ్‌శేషు ఆచార్యులు ప్రత్యేక పూజలు నిర్వంచి భక్తులకు ప్రసాద వితరణ నిర్వహించారు.

ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు

తాడేపల్లిగూడెం రూరల్: కూటమి విజయం సాధించిన సందర్భంగా మంగళవారం మండలంలోని జగన్నాథపురం గ్రామంలోని ఆంజనేయస్వామి ఆలయంలో హనుమాన్ చాలీసా పారాయణ, అష్టోత్తర పూజలు నిర్వహించారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వలవల మల్లిఖార్జునరావు (బాబ్జీ), జనసేన నాయకుడు బొలిశెట్టి రాజేష్ ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. మాజీ ఎంపీపీ పరిమి రవికుమార్, టీడీపీ నాయకులు ముత్యాల సత్యనారాయణ, పట్నాల రాంపండు, కిలపర్తి వెంకట్రావు, అడపా ప్రసాద్, వాడపల్లి సుబ్బరాజు, యెరుబండి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

జూన్‌లోనూ తగ్గేదేలే..

- విశ్వరూపం చూపుతున్న భానుడు
- కానరాని రుతుపవనాలు
- ఎండలతో ప్రజల అవస్థలు

తణుకు: వారం రోజులుగా తణుకులో విచిత్ర వాతావరణం కనిపిస్తోంది. పగటి పూట ఉష్ణోగ్రత అల్లాడిస్తుంటే.. సాయంత్రం మబ్బులు కమ్మి ఆహ్లాదం కలిగిస్తున్నాయి. కాసేపు చిన్నగా వర్షం కురిసినా, ఆ తర్వాత రోజు ఎండ బాదుడు మామూలే. గత సంవత్సరం జూన్ వచ్చిందంటే వర్షాలు కుంభవృష్టిని తలపించాయి. వరుణుడు కరుణించడంతో రైతులు ఉత్సాహంగా రబీ పంటల ద్వారా అధిక దిగుబడులు సాధించారు. అయితే ఈ ఏడాది వరుణుడు మచ్చుకైనా కానరాని పరిస్థితి.

జాడలేని రుతుపవనాలు...

నైరుతి రుతుపవనాలు ఈనెల 3వ తేదీన రాష్ట్రంలో ప్రవేశించినట్టు వాతావరణ శాఖ తెలిపింది. ప్రస్తుతం జూన్ 18వ తేదీ వచ్చినా వర్షాలు కానరావడం లేదు. వానలతో చల్లగా ఉండాల్సిన వాతావరణం భానుడు భగభగలతో నిప్పులు కొలిమిలా మారింది. ఏప్రిల్, మే నెలలలో సూర్య తాపంతో అల్లాడిన ప్రజలు జూన్‌లో వర్షాలతో సేదదీరవచ్చని భావించారు. అయితే రోజురోజుకూ ఉష్ణోగ్రతలు పెరగడమే కాకుండా ఉక్కబోత కూడా తోడవ్వడంతో చిన్న పిల్లలు, వృద్ధులు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మరోవైపు పగలు ఉష్ణోగ్రతలు పెరగడంతో రాత్రి పూట కూడా ఉక్కబోత అధికంగా ఉంటోంది. దీంతో ఏసీలు, కూలర్ల వాడకం బాగా పెరిగింది. మంగళవారం ఉష్ణోగ్రత 36 డిగ్రీలు నమోదైనప్పటికీ గాలిలో తేమశాతం 60 శాతం ఉండటంతో ప్రజలంతా అల్లాడిపోయారు. చిరువ్యాపారుస్తులు, తోపుడు బండ్లపై వ్యాపారం చేసుకునే వారంతా చెట్ల నీడ వద్దకు వెళ్లి సేదరడం కనిపించింది. మరో మూడు రోజుల పాటు ఎండలు కొనసాగు తాయని వాతావరణశాఖ హెచ్చరించడంతో ప్రజ లందరూ ఆందోళన చెందుతున్నారు.

జ్యూస్ షాపుల వద్ద రద్దీ

ఎండ నుంచి ఉపశమనం పొందడానికి ప్రజలు శీతల పానీయాలను ఆశ్రయిస్తున్నారు. లస్సీలు, కూల్ డ్రింకులు, జ్యూస్‌లు, కొబ్బరి బొండాలు, సోడాలు, తాటి ముంజెలు, చెరుకు రసాలకు డిమాండ్ పెరిగింది. ఆయా షాపుల వద్ద క్యూ కడుతున్నారు. పట్టణంలో ప్రధాన రోడ్డులో కలర్ సోడాలు, కొబ్బరి బొండాలు, జ్యూస్ షాపులు, చెరుకు షాపులు, తోపుడు బండ్లపైన కుండ లస్సీలు, తాటి ముంజెల వ్యాపారాలు జోరందుకున్నాయి. ఇదిలా ఉంటే ఉదయం నుంచే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపడంతో బయటకు రావడానికి ప్రజలు భయపడుతున్నారు. ముఖ్యమైన పనులు ఉంటే ఎంత తొందరగా పూర్తి చేసుకుని, ఇంటికి చేరు కుంటున్నారు. మధ్యాహ్నం సమయానికి దాదాపు రోడ్లన్నీ నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. సాయంత్రం 6 గంటలు దాటి న తరువాత కూడా ప్రజలు బయటికి రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి పూట కూడా వేడి, ఉక్కబోతతో అల్లాడిపోతున్నారు.



భానుడి ప్రతాపానికి తణుకులో నిర్మానుష్యంగా రోడ్డు

పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలపై పోరాటం

భీమవరం: కేంద్ర ప్రభుత్వం నూతనంగా అధికారంలోకి వచ్చిన తరువాత నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెరిగి సామాన్య, మధ్య తరగతి ప్రజానీకం అనేక ఇబ్బందులు పడుతున్నారని సీపీఎం జిల్లా నాయకుడు కె. రాజారామ్మోహన్‌రాయ్ ఆవేదన వ్యక్తం చేశారు. మంగళవారం పట్టణంలోని సుందరయ్య భవన్‌లో సీపీఎం రాజకీయ విజ్ఞాన తరగతుల్లో ఆయన మాట్లాడారు. ఉల్లిపాయలు, కూరగాయలు, పచ్చిమిర్చి ధరలు కిలో వంద రూపాయలకు పెరిగి ప్రజలు కొనుగోలు చేయలేని పరిస్థితి ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. గతంలో బీజేపీ ప్రభుత్వం అధికారంలోకి వస్తే నిత్యావసర వస్తువుల ధరలు తగ్గిస్తామని చెప్పి ప్రజలు మోసం చేసిందన్నారు. ఇప్పటికైనా పెరిగిన నిత్యావసర వస్తు ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించాలని లేకుంటే ప్రజలతో కలిసి ఆందోళన చేస్తామని ఆయన హెచ్చరించారు. రాజకీయ విజ్ఞాన తరగతుల్లో సీపీఎం పట్టణ కార్యదర్శి బి వాసుదేవరావు తాజా రాజకీయ పరిస్థితులు, నూతన ఆర్థిక విధానాలను బోధించగా ఈ తరగదులకు గొర్ల రామకృష్ణ ప్రిన్సిపాల్‌గా వ్యవహరించారు.



భీమవరంలో సీపీఎం రాజకీయ విజ్ఞాన తరగతుల్లో మాట్లాడుతున్న రాజారామ్మోహన్‌రాయ్

29న జాతీయ లోక్ అదాలత్



సత్యవతి

భీమవరం: ఈనెల 29న నిర్వహించే జాతీయ లోక్ అదాలత్‌లో సివిల్ కేసులు, రాజీ పడదగ్గ క్రిమినల్ కేసులు, చెక్కుబౌన్స్, మోటార్ యాక్సిడెంట్, మనోవర్తి, గృహ హింస తదితర కేసులను పరిష్కరించుకోవచ్చునని భీమవరం 3వ అదనపు జిల్లా జడ్జి, భీమవరం మండల న్యాయ సేవాసంస్థ చైర్ పర్సన్ డి సత్యవతి మంగళవారం తెలిపారు. కక్షిదారుల సౌకర్యంకోసం ప్రతి కోర్టులో ఒక న్యాయమూర్తి, న్యాయవాదితో బెంచ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ అంతిమతీర్పు కాబట్టి అప్పీలు చేసుకునే అవకాశం ఉండదని, సివిల్ కేసుల్లో ఇప్పటికే చెల్లించిన కోర్టు ఫీజు కూడా వాపసు వస్తుందన్నారు. కక్షిదారులు కేసులు రాజీచేసుకోడానికి ప్రతి రోజూ పర్మినెంట్ లోక్‌అదాలత్ చైర్మన్ ద్వారా వీడియో కాన్ఫరెన్స్‌లో ప్రీ లోక్‌అదాలత్ సిట్టింగ్‌లు నిర్వహిస్తున్నామని సత్యవతి తెలిపారు. కక్షిదారులు ఈఅవకాశాన్ని సద్వినియోగించుకుని కోర్టుల్లో పెండింగ్‌లోఉన్న కేసులను జాతీయ లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవాలని ఆమె కోరారు. జాతీయ లోక్ అదాలత్‌పై న్యాయవాదులు, పోలీసుఅధికారులు కక్షిదారులకు అవగాహనకల్పించి ఎక్కువ కేసులు రాజీ అయ్యేలా కృషి చేయాలని జడ్జి కోరారు.

ఉపాధి హామీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

భీమవరం అర్బన్: ఉపాధి హామీ కార్మికుల సమస్యలు పరిష్కరించకుండా, వారికి సకాలంలో బిల్లులు చెల్లించకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నాయని సీఐటీయూ జిల్లా నాయకులు ఎమ్. ఆంజనేయులు, ఇంజేటి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలంలోని తుందుర్రు, కె. బేతపూడిలో ఉపాధి హామీ కార్మికులను మంగళవారం సీఐటీయూ నాయకులు కలిసి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ ఉపాధి హామీ కార్మికులకు మే నెల నుంచి బిల్లులు చెల్లించకుండా రెండు పూటల మస్టర్ పేరుతో ఉదయం 6 నుంచి మధ్యాహ్నం వరకు పని చేయించడం, పే స్లిప్పులు, జాబ్ కార్డులు, పనిముట్లు ఇవ్వకపోవడంతో పాటు మెడికల్ కిట్లు వంటి సౌకర్యాలు కల్పించలేదని అన్నారు. ఉపాధి హామీ చట్టాన్ని కట్టుదిట్టంగా అమలు చేయకుంటే ఉద్యమాలను ఉధృతం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బుంగా సంతోష్, పాలపర్తి చంద్రపౌలు, నేతల ఝాన్సీ, దేశభక్తుల నాగరత్నం, గుబ్బల మంగతయారు, పెద్దిరాజు, ఏలూరు లాజర్, బుంగా మరియమ్మ, మోకా యోసయ్య పాల్గొన్నారు.



బేతపూడిలో ఉపాధి హామీ కూలీల సమస్యలు తెలుసుకుంటున్న సీఐటీయూ జిల్లా నాయకులు

కల్యాణ వైభోగం

అత్తిలి: బల్లిపాడు గ్రామంలో మదనగోపాలస్వామివారి సన్నిధిలో వెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాలు వైభవంగా జరిగాయి. ఉదయం విష్వక్సేన పూజ అగ్ని ప్రతిష్ఠాపన, ధ్వజారోహణం చేశారు. సాయంత్రం గరుడ వాహనంపై శ్రీస్వామి, అమ్మవార్లను ఉంచి సన్నాయి మేళంతో గ్రామోత్సవాన్ని జరిపారు. రాత్రి శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి కల్యాణ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై స్వామివారి కల్యాణ మహోత్సవాన్ని తిలకించి తరించారు. ఈ సందర్భంగా హాజరైన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రముఖులు గారపాటి ధర్మయ్య, ముత్యాల నాగేశ్వరరావు, గారపాటి బాబ్జి, ప్రగడ నాగేశ్వరరావు, ఆకుల రామచంద్రరావు, గారపాటి ఆశోక్, కసిరెడ్డి అప్పారావు, దాసం ఆదినారాయణరావు, బాడిగ చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.





బల్లిపాడులో వేంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న దృశ్యాలు

కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

తాడేపల్లిగూడెం (టీఓసీ): పాతూరులో అరుంధతి పేటలో 100 కేవీ కొత్త అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. పాతూరు వినాయకుడి గుడి వద్ద ఉన్న 160 కేవీ ట్రాన్స్‌ఫార్మర్ లోడ్ సరిపోకపోవడంతో విద్యుత్ సరఫరాలో అంతరాయాలు తరుచుగా ఏర్పడుతున్నాయి. పాతురులో మరో ప్రాంతమైన అరుంధతి పేటలో విద్యుత్ సమస్యలు రావడంతో లోడు సరిపోక ట్రిప్ అవ్వడంతో స్థానికులు రాత్రి, పగలు తేడా లేకుండా అనేక ఇబ్బందులు పడుతున్నారు. సోమవారం రాత్రి పాతూరు అరుంధిత పేట మహిళలు ఇండోర్ సబ్ స్టేషన్ వద్ద అంతరాయాలను తొలగించాలని నిరసన వ్యక్తం చేశారు. స్థానిక నేతలు సమస్యను ఎమ్మెల్యే బొలిశెట్టి శ్రీనివాస్ దృష్టికి తీసుకువెళ్లారు. ఆయన స్పందించి విద్యుత్ ఏడీఈ ఆకుల సతీష్‌తో మాట్లాడారు. మరో అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను అరుంధతిపేటలో ఏర్పాటు చేయాలని ఆదేశించారు. దీంతో అరుంధతి పేటలో అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను యుద్ధప్రాతిపదికన మంగళవారం సాయంత్రం ప్రారంభించారు. విద్యుత్ సరఫరా జరగడంతో శాసన సభ్యులకు, విద్యుత్ అధికారులకు స్థానికులు కృతజ్ఞతలు వెల్లడించారు.

సమస్యల్ని తమ దృష్టికి తీసుకురండి

తాడేపల్లిగూడెం రూరల్: సచివాలయ, పంచాయతీ సిబ్బంది పరిష్కరించలేని సమస్యలను తమ దృష్టికి తెస్తే వాటి పరిష్కారానికి కృషి చేస్తామని నందమూరు సర్పంచ్ శనగన వరలక్ష్మి అన్నారు. మంగళవారం మండలంలోని నందమూరులో సచివాలయ, పంచాయతీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడారు. సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ సమావేశంలో కూటమి నాయకుడు శనగన రాంబాబు, దార్లంక రాము పాల్గొన్నారు.